క్లుప్తంగా

నేటి నుంచి జోనల్‌స్థాయి క్రీడలు

జడ్చర్ల: మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి సమీపంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం నుంచి 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్ కళాశాలలకు చెందిన 680మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారన్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలకు సంబంధించి అథ్లెటిక్స్, లాంగ్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 11నుంచి 14వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని, అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన

నవాబుపేట: ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని లోకిరేవు గ్రామంలో ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల నమోదుపై ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. శని, ఆదివారాలు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

రాజస్తానీ నవయువక్ మండల్ నూతన కార్యవర్గం



స్టేషన్ మహబూబ్‌నగర్: రాజస్తానీ నవయువక్ (యువజన విభాగం) మండల్ పాలమూరుశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రం వేపూరిగేరిలో భీమలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా జయప్రకాశ్‌జీ భాంగడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్‌జీ పసరి, కార్యదర్శిగా మహేష్ చందర్‌జీ దూత్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మీకాంత్‌జీలోయ, కోశాధికారిగా రాహుల్‌జీ అగర్వాల్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా 15మందిని ఎన్నుకున్నారు. మండల్ సలహాదారులుగా సురేష్‌చందర్‌జీ దూత్, శివప్రకాశ్‌జీ లాహోటియ, ఉమేష్‌జీ బాంగడ్ వ్యవహరించనున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



మాగనూర్: మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-167పై శనివారం అర్ధరాత్రి సమయంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులుగా పనిచేస్తున్న చంద్రారెడ్డి, అతడి భార్య నయనగుప్తా సూర్యపేట నుంచి తమకారులో రాయచూర్‌కు వెళ్తున్నారు. మాగనూర్‌లోని రోడ్డు పక్కన ట్రాక్టర్‌నిలిచి ఉండటంతో వారి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హెయిర్ బెలున్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్ర గాయాలు కాగా, స్థానికులు గమనించి వారిని అంబులెన్స్‌లో రాయచూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇదేక్రమంలో వరుసగా ఆగి ఉన్న ట్రాక్టర్లను కారు ఢీకొట్టడంతో అటుగా వెళ్తున్నరాము అనే బాటసారి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. రోడ్డుపై అడ్డుగా వాహనాలు నిలుపుతున్నా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక రవాణా



మరికల్: మండలంలోని ఎలిగండ్ల శివారులో ఉన్న మన్నెవాగు నుంచి నెలరోజులుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రి, పగలు తేడా తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ. 4వేల నుంచి 6వేల మధ్యన ఇళ్ల నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి ఆయా అక్రమంగా రవాణ ఇసుక రవాణను నిలిపివేసి ఆన్‌లైన్ ఇసుకకు అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపైనే మురుగు



రాజీవ్ కాలనీలో ఇళ్ల ముంగిట మురుగు నీటి మడుగులు

- కంపు కొడుతున్న కాలనీలు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జడ్చర్ల: మున్సిపాలిటీలో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. పలు కాలనీలు కంపు కొడుతున్నాయి. కాలనీలు విస్తరిస్తున్నా మురుగు నీరు సక్రమంగా పారేందుకు డ్రైనేజీలు నిర్మించలేదు. ఎక్కడికక్కడ మురుగు మడుగులు కనిపిస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర విష జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పట్టణమంతా మురికి కూపంగా మారింది. చెత్తచెదారంతో పేరుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని కాలనీల్లోనూ..

మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లోనూ మురుగు నీటి సమస్య ఉంది. రాజీవ్ నగర్, వెంకటేశ్వర కాలనీ, సత్యనారాయణ స్వామి ఆలయం పరిసర కాలనీలు, సరస్వతీ కాలనీ సమీపంలో, ఇంపీరియల్ గార్డెన్ సమీపంలో గల అనేక కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. సాయినగర్, విజయ్‌నగర్ కాలనీ, బాదేపల్లి లోని రాజీవ్‌కాలనీ, కావేరమ్మపేట, బూరెడ్డిపల్లి, నాగసాల గ్రామాల పరిధిలో డ్రైనేజీ సమస్యలతో అల్లాడుతున్నారు.

ఇళ్ల ముంగిటే మడుగులు



డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు ఇళ్ల ముంగిటే చేరి మడుగులు తయారయ్యాయి. వీటిల్లో పందులు దొర్లుతున్నాయి. ఈగలు, దోమలు అధికమయ్యాయి. పరిసరాలు కంపు కొడుతున్నాయి. రోగాల బారిన పడుతున్నాం.

– అరుణ, రాజీవ్‌కాలనీ, జడ్చర్ల

గుంపులుగా పందులు..

మున్సిపాలిటీ పరిధిలో పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. విచ్చల విడిగా పందుల గుంపులు సంచరిస్తున్నాయి. మురుగులో అవి దొర్లుతుండడం, పరిసరాల్లో సంచరిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కొన్ని నెలలుగా పందుల సంఖ్య వందల్లో పెరుగుతుండడంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.



జడ్చర్లలో గుంపులుగా పందుల సంచారం

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు కిరణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు బోనస్ ఇవ్వాలి

- ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు



కొకుంట్లలోమాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు

దేవరకద్ర: పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర రూ.7620 చెల్లించి బోనస్ కూడా ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం కొకుంట్లలో పత్తి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పత్తి కొనుగోలు కోసం సీసీఐ ఏర్పాటుచేయాలన్నారు. ప్రతి మండలంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. పత్తి రైతుల సమస్యలపై జరిగే బంద్‌కు మద్దతునిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొకుంట్ల మండల పత్తి రైతులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి

- ఎంపీడీఓ దేవన్న

గండేడ్: ఇంటింటి సర్వేలో తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ దేవన్న అన్నారు. ఆదివారం మండలంలోని గండీడ్, వెన్నచేడ్, కొండారెడ్డిపల్లి, బల్‌సుర్‌గొండతండా, రంగారెడ్డిపల్లి, పెద్దవార్వాల్, జానంపల్లి గ్రామాల్లో సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి మర్యాద పూర్వకంగా వివరాలను సేకరించాలని సూచించారు.

ఉదయమే ఇళ్ల వద్దకు వెళ్లి...

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం కూడా సర్వే కొనసాగింది. ఎన్యూమరేటర్లు ఉదయమే ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేశారు. ఒక్కో ఇంటి వద్ద అరగంటకు పైగా సమయం తీసుకుంటున్నారు. ఎంపీడీఓలు శ్రీనివాస్, కృష్ణయ్య సర్వేను పరిశీలించి సూచనలు చేశారు.



వెన్నచేడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న



అడ్డాకుల మండలం చిన్నమునుగల్‌ఛేడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మూ'తో'బడి'ంది

- నిరుపయోగంగా పాఠశాల భవనం
- రూ.లక్షల నిధులు వృథా
- గ్రామంలోనే స్కూల్ కొనసాగించాలంటున్న ప్రజలు

గండేడ్: మండలంలోని రుసుంపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డెగుడిసెల్లో పాఠశాల మూతబడింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన స్కూల్ భవనం నిరుపయోగంగా మారింది. ప్రారంభించిన నాటి నుంచి ఒక్క రోజు కూడా దానిని ఉపయోగించలేదు. దీంతో చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. వడ్డెగుడిసెల్లో ఒకటి నుంచి ఐదోవ తరగతి వరకు ఉండేది. విద్యార్థుల కోసం 2014లో రూ.5.45లక్షలతో పాఠశాల అదనపు గదిని నిర్మించారు. ఊరికి దూరంగా ఉండటంతో పాటు చుట్టూ గుట్టలు, చెట్లు ఉన్నాయి. దీంతో ఆగది ఎందుకు పనికి రాకుండా పోయింది. ఇక్కడ ఉన్న విద్యార్థులు సైతం రుసుంపల్లి పాఠశాలకు వెళ్తుండగా టీచర్‌ని కూడా అక్కడికే పంపిస్తున్నారు. ప్రస్తుతం పాత పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కొత్తగా నిర్మించిన భవనం నిరుపయోగంగా మిగిలింది. పాఠశాలను గ్రామంలోని పాత భవనంలోనే కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతాం..

వడ్డెగుడిసెల్లో పాఠశాల మూతబడిన ఈవిషయమై ఎంఈఓ జనార్దన్‌ను వివరణ కోరగా జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంగా పాఠశాలను మూసివేశామన్నారు. ఇక్కడి ఉపాధ్యాయుడు కూడా రుసుంపల్లి పాఠశాలకు వెళ్తున్నాడు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలోనే పాఠశాల కొనసాగేలా చూస్తాం.



పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

గుట్టపై మట్టి తవ్వకాలు

- అడ్డుకున్న గ్రామస్తులు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపైకి వెళ్లే దారిలో ఉన్న గుట్టపై ఆదివారం మట్టి తవ్వకాలు చేపట్టారు. గమనించిన ఆయా గ్రామస్తులు అడ్డుకున్నారు. వేముల స్టేజీ వద్ద నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జిలో భాగంగా సర్వీస్ రోడ్ల కోసం ఇక్కడ మట్టి తవ్వకాలను చేపట్టారు. గుట్టపైకి సీసీ రోడ్డు వేయడంతో పాటు కొత్తగా కల్వర్టును కూడా నిర్మించారు. సమీపంలోనే తవ్వకాలు చేస్తుండటంతో మూసాపేట, సంకలమద్ది గ్రామాలకు చెందిన రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు అడ్డుకున్నారు. తవ్వకాలకు ప్రభుత్వ అనుమతి ఉందని బ్రిడ్జి కాంట్రాక్టర్ చెప్పడంతో కొంతసేపు అక్కడ వాగ్వాదం జరిగింది. మట్టి తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు. తవ్వకాలను నిలిపేసి అక్కడి నుంచి వాహనాలను తీసుకెళ్లారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాసులు(ఫైల్)

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన కోళ్ల శ్రీనివాసులు(55) అనే వ్యక్తి ఈనెల 7వ తేదీ గురువారం ఉదయం 5గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. మూడు రోజులైన తిరిగి రాకపోవడంతో బంధువు దగ్గర వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం అతడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్న ఎంపీ

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ముల, మున్ననూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పరిశీలించనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెతో పాటు బీజేపీ రాష్ట్ర బృందం మండలంలో పర్యటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అడవిలో అమ్మవారి జపం

నవాబుపేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ అడవిలో ఆదివారం అమ్మవారి జపం మార్మోగింది. సెలవు దినం కావటంతో భక్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో అడవి మొత్తం భక్త జనాలతో సందడిగా మారింది. అమ్మవారి సన్నిధిలో చిన్నారులు బలిపీఠంపై నాణేం నిలబెట్టి కోరికలు కోరుకోవటం ప్రత్యేకంగా కనిపించింది.



మైసమ్మ దేవాలయంలో నాణేం నిలబెడుతున్న చిన్నారులు

త్వరలోనే సీసీ రోడ్లు నిర్మిస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వెంకటేశ్వరకాలనీలో త్వరలోనే సీసీ రోడ్లు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఈకాలనీలో ఆయన పర్యటించారు. రోడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదుచేశారు. స్పందించిన ఆయన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు గంజి ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరకాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్.

ధర్మ రక్షణకు సిద్ధం కావాలి

- భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ సంయోజక్ వెంకటేశ్



రక్తదాతలను అభినందిస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌గర్ / మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ధర్మ రక్షణకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు సిద్ధం కావాలని ఆసంస్థ రాష్ట్ర సహ సంయోజక్ వెంకటేశ్ అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం జరిగిన కరసేవలో ప్రాణాలర్పించిన వారిని స్మరిస్తూ ఆదివారం హుతాత్మ దివాస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటేశ్ పాల్గొని మాట్లాడారు. భజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి గోవులను కాపాడుతున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ సమాజ సేవ చేస్తున్నారన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ ప్రతి బస్తీలో భజరంగ్‌దళ్ టీమ్‌లు ఏర్పాటుచేసి కార్యకర్తలను సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర గోరక్ష ప్రముఖ్ టి.సురేష్ బాబు, చాపల హన్మంతు, రాచాల జనార్దన్, జిల్లా సంయోజక్ వంశీ, సహ సంయోజక్ కుమార్, నగర సంయోజక్ ఛత్రపతి, శ్రావణ్, జయంత్, అయ్యప్ప, సంపత్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ధాన్య కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. గోపన్‌పల్లి గ్రామంలో దేవరకద్ర వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బుచ్చన్న, జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, తదితరులు

ఏకాభిప్రాయంతోనే అభ్యర్థిని ఎంపిక చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



యాదయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల పురపాలిక నూతన చైర్‌పర్సన్ అభ్యర్థిత్వాన్ని ఏకాభిప్రాయంతోనే ఖరారు చేద్దామని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ కౌన్సిల్ సభ్యులకు సూచించారు. ఆదివారం తిరుమల హిల్స్‌లో ఆయన కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా లక్ష్మారెడ్డి కౌన్సిల్ సభ్యులకు పలు సూచనలు చేశారు. పార్టీని వీడిన వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వారిపై పార్టీ ఫిరాయింపు చర్యలు చేపడుతామన్నారు. ఏమైన అనుమానాలు ఉంటే తనతో నేరుగా చెప్పుకోవచ్చన్నారు. వైస్ చైర్‌పర్సన్ మార్పు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. బహిరంగంగా ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆయన సూచించినట్లు తెలిసింది. సమావేశంలో పురపాలక మండలి సభ్యులు లత, పుష్పలత, జ్యోతి, చైతన్య, నందికిషోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, దేవ, ఉమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌మెన్ కుటుంబానికి పరామర్శ

మిడ్జిల్: పంచాయతీ వాటర్‌మెన్ యాదయ్య భార్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి యాదయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీనువాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్, నాయకులు వెంకట్‌రెడ్డి, శేఖర్, జగన్,శ్రీను, గోపాల్, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



క్యూలైన్లో నిల్చున్న భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఏడుకొండలవాడి నామస్మరణతో కురుమూర్తిగిరులు మారుమోగాయి. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చి ఉంటారని అధికారులు తెలిపారు.



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు